

# విలోకనం

'ఆమె నీకు ద్రోహం చేస్తోంది - తెలీదూ?'— గోపాలరావుకు తెలిసే ఉండాలి. ఆమెతో నాకంటే అతి సన్నిహితమైన పరిచయం కలవాడు సరికదా, పెండ్లికాని దంపతులమని తామే చెప్పుకుంటారు. గోపాలరావుకు అభిమానం, సంకోచం అనేవి లేవు. నిటారుగా నిలచి, అమాయకమైన సహజత్వంతో, స్పష్టమైన ఆలోచనలతో నిస్సంశయుడై బ్రతికే గోపాలరావు శీలం నాకెంతో ఆదర్శవంతంగా ఉంటుంది. నిజానికి అతనిని గౌరవించి, పూజిస్తాను పువ్వుల్లో. కాని అతను మామూలు మనిషి అయితే ఈ సరికి ఈర్ష్యతో అసహనంతో ముళ్లకంపలమీద చావలేక బ్రతుకుతూండేవాడు.

గోపాలరావును సందర్శించిన ప్రతి రోజూ ఒకే ప్రశ్న నాకు స్ఫురిస్తుంటుంది: 'అతనికి తెలీదా?' అని. కాని అడగడానికి నోరురాక, ఏవో అనవసర ప్రశ్నలతో అతనికి విసుగుగొలిపి, జవాబులు వినలేక నొచ్చుకుంటాను.

కాని ఈనాటి సాయంత్రం గోపాలరావు ఇంట్లో నేను ఉండగానే ఒక చిత్ర సంఘటన జరిగింది. అది అపూర్వమూ, నూతనమూ కాదని నాకు ఎన్నాళ్లక్రితమో తెలుసు. కాని నాకు కొత్తగా కనిపించింది.

గోపాలరావు ఇంటికి నేను వెళ్లేసరికి అతను ఒంటరిగా ఎదటి హాలులో చుట్ట కాల్చుకొని విశ్రమిస్తున్నాడు. నన్ను ఆదరంతో ఆహ్వానించి కూర్చోపెట్టాడు. 'మాలతీ! మూర్తి వచ్చాడు' అని గట్టిగా లోపలికి వినిపించేట్లు కేకేసి, 'ఇన్నాళ్లూ కనిపించలేదేం?... అలా నా వంకకు గుడ్లు విప్పి చూడక నీ అనుమానమేమిటో చెప్పకూడదూ?' అని అద్దాలాంటి తన కనులతో నా మనస్సుకు ముద్రతీస్తున్నట్లు గోపాలరావు స్వేచ్ఛగా మాట్లాడుతుండే నాకు ముచ్చెమటలు పోశాయి.

ప్రారంభించడానికి సాహసం చాలక, హాస్యంలా అతని మాటలను తేల్చివేసినట్లు కూని రాగం తియ్యడానికి ప్రయత్నించి తుదకు, 'మధుసూదనం రాలేదా ఈ మధ్య?' అని అడిగాను. మధుసూదనరావు - క్లుప్తంగా సామాన్య పదాలలో చెప్పాలంటే - నా స్నేహితుని బావమరది. మాలతి కాపురం చేస్తుండగా రెండు మూడు సార్లు తప్పితే ఎక్కువ రాలేదు. అతను ఎల్లప్పుడూ తొందర పనులలో మునిగి ఉంటాడు. నున్నగా దువ్విన తల, ఎర్రటి పెదవులమీద పలచని చిన్న మీసం, పరాకునైనా ముస్తాబు లేని క్షణం మధు జీవితంలో ఒక్కటీ లేదు. ధనిక వర్గంలో ఉన్నత తరగతికి చెందిన లాంఛనాలకు ఏమీ లోటు చేయడు. ఆ సంప్రదాయాలూ, ఆచారాలూ, నియమ నిబంధనలూ అంటే అతనికి ప్రాణం, వాటిని వ్యతిరేకించినా, ఎగతాళి చేసినా సహించలేడు. తాను అభినందించే సంఘ వ్యవస్థను నిర్దాక్షిణ్యంగా ఖండించి దానిని వ్యతిరేకించే గోపాలరావు తుదకు తన చెల్లెలినే చెట్టబట్టిన విషయం తెలిసిన రోజున మధుసూదనరావు కోపానికీ, దుఃఖానికీ, రహస్య ఆనందానికీ మేరలేదు. తాను మనసిచ్చి ప్రేమిస్తాడు

డి. రాధాకృష్ణ పట్నాయక్

గోపాలరావును, కాని అతని భావాలు నచ్చవు. అతని ప్రవర్తన బట్టబయలుగా, సిగ్గుచేటుగా, హీనంగా కనబడుతుంది. మధు తన చెల్లెల్ని అతి దీనంగా ప్రార్థించాడు, 'ఈ దుడుకుపని వద్దు. నామాట విను. మన వంశ గౌరవం నీ చేతిలో ఉందిప్పుడు. ఒద్దు — తొందరపడకు!' కాని మాలతి పట్టు పట్టి, గోపాలరావును తాను పెండ్లి చేసుకోననీ, 'పెళ్లి' అనేది మూఢ విశ్వాసం కనుక దానిని వ్యతిరేకించడం హేతువాదుల ముఖ్య కర్తవ్యమనీ స్పష్టపరిచింది. చేయగలది లేక మధుసూదనం ఈ అక్రమాన్ని సహించాడు కాని దీనికి బహిరంగంగా సమ్మతించలేదు. అలాగని అతనికి ఈ సంబంధం అయిష్టమైనదికూడా కాదని నేను బాగా ఎరుగుదును. తొలుత గోపాలరావును తన ఇంటికి రప్పించినదే మధు. అతనికి ఇష్టం కనుకనే గోపాలరావు నమ్మే హేతువాదం క్రమేపీ మాలతికి కూడా వ్యాపించింది. గోపాలరావు నిర్మొగమాటంగా తనకు పూజ్యమైన ప్రతి విశ్వాసాన్నీ ఖండించి, అవి అహేతుక మూర్ఖ్యమని రుజువు చేస్తుంటే మధుసూదనరావు మందహాసం చేసేవాడు తప్పితే ఎదిరించ లేదు. మనసులో అతను కూడా హేతువాది కావచ్చునని నాకు చాలాసార్లు అనుమానం తోచేది.

'అవును. వచ్చాడు— సాయంత్రం వస్తానన్నాడు' అని జ్ఞాపకం తెచ్చుకుంటూ గోపాలరావు సమాధానం చెప్పాడు.

'అతను చాలా మారినట్టున్నాడు కదూ? మధులాంటి లాయరు- ధనికుడు- మారిపోయాడంటే అది నీవల్లనే' అన్నాను.

'నాను చేతకాలేదు అతన్ని మార్చడం. ఎట్లా మారుస్తాం మట్టిని బంగారంగా?... నాను వైరాగి చిటికలు తెలీవు. అతను మారడు. అంతే. రాత్రీ పగలూ పని చేసి ఆదాయం ఎక్కువ చేసుకుంటాడు; ప్రఖ్యాతుడై పదిమంది పొగడ్తలు వింటాడు. అమూల్యాలైశ్వర్యాలతో నూరేళ్ళు బ్రతికి తుదకు చనిపోతాడు: ఇవన్నీ మార్పులని నువ్వనుకొంటే, అతనిలో చాలా మార్పులు వస్తున్నాయి. కాని అవి మార్పులు కావు. అవే మూఢవిశ్వాసాలతో ఎప్పుడూ పాత-పాత- పాతకోసం, బూజుపట్టిపోయే మనిషిని నువ్వు మనిషి అంటావేమో. దేవక అంటారు. నేనూ ఒప్పుకొంటాను, వాడు అలాటి రకమేనని.'

నేను ఆమోదంతో నవ్వాను, గోపాలరావు నన్ను విరమించుకోలేదు:—

'ధనికవర్గపు అభిప్రాయాలు మంచివయితే అతనివీ మంచి అభిప్రాయాలౌతాయి. కాకపోతే కాదు. అవి పాతవి. క్రుళ్లిన అయితే మధువీ కుళ్ళి కంపుకొట్టే ఉద్దేశాలు. వ్యక్తిత్వం లేదు. చేవ అంటారు, తెలుసా, చేవ! అది లేదు మధుకి. అనేక పుటల గ్రంథంలో మధు ఒక పేజీ. కాని ఆపుస్తకమే శిథిలావస్థలో ఉంటే?' గోపాలరావు చుట్ట ఆరిపోయింది. దానిని మళ్లీ వెలిగిస్తూ, 'వజ్రాన్ని వజ్రమే కోయగలదంటారు, కదూ! అవును. అవును. విశ్వాసాన్ని అంతకంటే తీవ్రమైన విశ్వాసమే జయిస్తుంది. నీ హేతువాదం ఎందుకూ కొఱగాదు మూర్తీ, ఎందుకూ కొఱగాదు.'

గోపాలరావు ఇలాటి ఉపన్యాసాలకు ఉపక్రమిస్తేనే నాకు వినాలని అభిలాష. ఎంత ప్రొద్దుపోయిందో తెలియని పరవశత్వంతో అట్టి రోజుల్లో మేం త్రుటిలో రోజులు గడిపి, సంవత్సరాలు పెరిగి వ్యాపిస్తాం. ఒక సంభాషణ జరిగిన తరువాత నేను నాలో విశేషమైన మార్పును గమనిస్తాను. ఏమంటే నాదృక్పథంలో క్రొత్తదనం ఏదో నన్ను ఆవేశిస్తుంది.

'మధుసూదనం స్వయంగా సంపాదించిన లక్షరూపాయిల ఆస్తికి మనోకదయితే భూమ్మీద నిలవడు, గోపీ. మధు చాలా ఉత్తముడు, నిగర్వి. అతని విశాలహృదయం ఇంకెవరికీ లేదు—నిజం!' అని అప్రయత్నంగా మధుసూదనరావును బలపరిచాను, యథార్థంగా అతని ధనికతత్వాన్ని ఏవగించే నేను.

'నేను ఏనాడూ కాదనలేదు. ఇప్పుడు నువ్వు చెప్పినందుకు నేను ఖండించను. ఎందుకు? మధు ఉత్తముడు-అంటే? నిగర్వి-కాక? దేనివల్ల ఆ వైశాల్యం?...' చేతులు బారుగా సంజ్ఞ చేశాడు, మాట నిగిడిస్తూ, 'సెంట్రలు జైలు చాలా విశాలం. డాచౌ కన్సంట్రేషన్ కేంపులో కొన్నివేల మందిని ఇముడ్చుకో గల 'ఉదారత' ఉంది ... కాని, కాని...సహారా విశాలమైంది కాదని ఎవరంటారు చెప్పు! అవి

గొడ్డుభూములు. వృథా...వృథా. నిరర్థకంగా బ్రతికే పశువులూ, పర్వతాలూ, మధుసూదనులూ' గొంతు దించుకొని గోపాలరావు అంటుండగా వీధిద్వారం తెరచుకొనే చప్పుడు వినిపించి, కొంపతీసి మధుసూదనరావు గారేమోనని ఉలికిపడ్డాను. 'వీళ్ళమంచిదనం, ఔదార్యం, ఇంకా ఏమన్నావ్ నిగర్వం- అన్నీ, ఇంకెన్నో, అవన్నీ, తమలోని మూలసూత్రాన్ని ఆధారం చేసుకొంటాయి. కైవారం కేంద్రాన్ని వరించినట్టు...'

ఉమామహేశ్వరరావు నీటుగా గదిలోకి వచ్చాడు. అతని బూటుచప్పుడులో కూడా అతిప్రయాసతో నేర్చిన నేర్పరితనం ఉట్టిపడుతుంది. మాయని ముస్తాబులు, సుకుమారమైన మన్ననలు, చక్కిలిగింతలు పెట్టినలాంటి సంభాషణలతో ఇతరులను సులభంగా రంజింపచేయగల శక్తి అతనికి విపరీతంగా ఉంది.

వస్తూనే రుమాలును తన చేతిలో తెల్ల మబ్బులా ఊపుతూ, చిరునగవుతో 'గుడ్ మార్నింగ్ గోపాలరావుగారూ!' అని అతను వినిపించుకోకపోయిన మాత్రాన నిరుత్సాహపడక నన్ను చూచి 'గుడ్ మార్నింగ్!' అని దగ్గరకు వచ్చాడు.

గోపాలరావు అభిమానంతో పలుకరించి, వేరే కుర్చీలు లేక తానే లేచి, 'నువ్వు కూర్చో అలా నిలబడతావేం?' అని ఎదటి గుండ్రని మేజామీద ఆసీనుడైనాడు.

తొందర పడకు, సంభాషణ ఆగినందుకు విచారించకు, కొలువుకూటంలో చక్రవర్తిలాగా కూర్చొని, 'మీ సంభాషణకు అడ్డువచ్చానేమో క్షమించండి' అని స్త్రీలకు రుచ్యమైన కొంటె నవ్వుతో-'సరే కానీయండి, సంశయిస్తారేం? క్షమించండి, ఆటంకమైతే నేను ఇదుగో' అని కుర్చీ ఓ అడుగు వెనక్కిలాగి చేరబడ్డాడు.

గోపాలరావు మాట్లాడలేదు. అతను ఏమంటాడోనని నేను గోపాలరావును చూస్తున్నాను.

కొన్ని సెకెండ్లు నిశ్శబ్దంగా గడిచాయి.

గోపాలరావు నా కుర్చీచేతిమీద కాళ్లుపెట్టి, విరగబడి నవ్వుతూ 'ఉమా! మాట్లాడవేం?' అన్నాడు.

ఉమామహేశ్వరరావు బుగ్గలు జేవురింపుకొట్టాడు.

'మాట్లాడు, విందాం. నిజంగానే నిన్ను చూస్తే నాకు నవ్వెందుకొస్తుంది?'

నవ్వెందుకు రావాలి? ఏడుపు రావాలి ఎవరికైనా ఈ పరిస్థితిలో.

ఉమామహేశ్వరరావు ధనికుడు, ఒక పంచదార మిల్లుకూడా ఉంది. బి. ఏ. పాసయి ఇంకా సంవత్సరం నిండలేదు. అంతా తనదే ననే అభిప్రాయం. తనకు తెలియనిది లేదనే అహంకారం. నాలుగు మాసాలక్రితం గోపాలరావు అతనిని సినిమాహాలులో గమనించాడు. ఇద్దరూ ఒకరిచేరువ నొకరున్నారట. మాలతి కూడా వచ్చింది. ఉమామహేశ్వరరావు అతి పరిచయంగా ఇరువురినీ సత్కరించి సినిమా విమర్శన, కళ, రసం, రాజకీయాలు, సైకాలజీ, కుర్చీలలో ఉన్న నల్లులు, గాలిలేని థియేటరు, దోమలు, వెయ్యిమాటలుచెప్పి మాలతి స్నేహాన్ని సంపాదించాడు. గోపాలరావు అతనిని ప్రేమతో మన్నించి తీరిక ఉన్నపుడంతా ఇంటికి వచ్చిపోతుండమని ఆహ్వానించాడు. మాలతి దానిని బలపరిచింది.

'మీకు ఆనందంగా ఉంటే నవ్వండి. మీ ఇష్టం. నేనేం చేస్తాను?'

మేజా దిగి అతనిని సమీపిస్తూ 'నీకు దుఃఖంగా ఉంటే ఏడుస్తావు-అంతేకదూ?' అని ఉమామహేశ్వరుని భుజంతట్టి, 'వెళ్లి టీ తీసుకురా' అని బుజ్జగించాడు గోపాలరావు. ఆ దృశ్యం నా జీవితంలో ఎన్నటికీ మరపురాదు. అపూర్వ అనుభూతి పొందాను. పురాణాలలో విని నేను విశ్వసించలేకపోయిన మహా మునీంద్రుడు నాగోపి అని, అతని దగ్గిర సింహాలు పిల్లి పిల్లలని గుర్తించాను.

గోపాలరావు నావంకకు వచ్చి 'కూర్చోడానికి విసుగ్గా లేదూ? పద, తిరిగివద్దాం' అని నా భుజంమీద ఎడంచేతిని చుట్టబెట్టి తీసుకెళ్ళాడు. దారిలో అతని మాటలను నేను పరధ్యానంగా విన్నాను.

'అలా ఉన్నావేం మూర్తీ?'

'...ఎలా?' అని నేనే ఆశ్చర్యపడ్డాను.

'నిజమే. అలా ఎందుకున్నావు?'

నాలో రగులుతున్నదల్లా — అంతరంగంలో చెలరేగుతూ, మూలుగుతూ విజృంభిస్తున్న అసూయ, ద్వేషం, కోపం-నన్ను పరవశుని చేసి, బిగ్గరగా అడిగాను: 'ఆమె నీకు ద్రోహం చేస్తోంది-తెలీదా! ఉమ...వాడు పెద్ద స్కౌండ్రెల్. వాడు నిన్ను పాతాళానికి ముంచుతున్నాడు. సర్వనాశనం చేస్తాడు. గోపీ, గోపీ, నీ వెనక వాళ్ళు గొయ్యి తవ్వుతున్నారు...అది నీ సమాధి తెలుసా?'

గోపాలరావు తీక్షణంగా నా కళ్ళలోకి చూశాడు. బహుశా భయపడి ఉంటాను, మరింత సాహసించాను.'-నీవే నా ప్రాణం-నీవు లేనిదీ బ్రతకలేను-ఏది ఏమైనా సరే, భిక్షించుకొని పెళ్ళాడిన...'

'మేం పెండ్లాడ లేదు.'

'అయినా మాలతి నీకు భార్యలాంటిది. ఆమెను ఆదరంగా చూసుకొంటున్నావు. ఆమెను నమ్మావు. ఇప్పుడు అనీచుని వలలో పడి నిన్ను మోసగింపనున్న పాతకి, కులట, మాలతి!' నాకు మాటలు అందిరావటం లేదు. మాటల్ని మ్రింగగల ఉద్రేకంతో చేతులూ, కాళ్లూ ఊపుతూ, కళ్ళలో నిప్పులు క్రక్కుతూ నా తలపుల్ని వ్యక్తం చేయడానికి ఎంత ప్రయత్నించినా, సాధ్యం కావటం లేదు.

గోపాలరావు నిర్లక్ష్యంగా: 'ఉండు, బిస్కట్లు కొని, పోదాం. వాళ్లు పాపం ఎదురు చూస్తుంటారు' అనేసి సమాధానానికి నిరీక్షించకనే దుకాణంలోకి వెళ్ళాడు. నేను పరుగెత్తి వెళ్ళి బిల్లు చెల్లించాను.

ఇల్లు వదిలి అరగంట మించి ఉంటుంది గనుక, గోపాలరావు కించపడ్డాడు. దారిలో టాక్సీ దొరికినప్పుడు, గోపాలరావు మహా సంతోషంతో నన్ను అదిమి కూర్చోబెట్టి, 'త్వరగా పోనీయ్, పోనీయ్' అని డ్రైవరును మాటిమాటికీ హెచ్చరించాడు.

బిస్కత్తు కొరుకుతూ గోపాలరావు గదిలోకి వచ్చేసరికి 'హల్లో గోపీ' అని మధుసూదనరావు ఆహ్వానిస్తున్నాడు. గోపాలరావు ప్రేమతో సమాధానమిచ్చి 'ఏంటమ్మా, టీ ఏదీ?' అని అడిగాడు. నౌకరు అప్పుడే ట్రే తెచ్చి టేబిలు మీద ఉంచాడు. మేం అందరం కూర్చున్నాము. పడక కుర్చీలో మధుసూదనరావు చేరబడ్డాడు. పేకెట్ విప్పి, మాలతి ఒకరొకరికే పంచింది. గోపాలరావు అతి ఆకలితో నాలుగు తినేసి, పొట్లాంలో మిగిలిన వాటిని తొడలో పెట్టుకు నిదానంగా కొరుకు తున్నాడు. మధుసూదనరావు నాతో ఇంగ్లీషులో మాట్లాడాడు. ఉమామహేశ్వరరావు అందరితోనూ పరిహాసాలాడుతూ మాలతిని అనుకుని కూర్చున్నాడు. ఇల్లు చాలా సందడిగా ఉంది. అందరూ ఉత్సాహంగా ఉన్నారు. గోపాలరావు ఎక్కువ మాటలాడలేదు గాని బిస్కత్తు నమలటంలో ఏకాగ్రచిత్తుడు కానప్పుడంతా శ్రద్ధగా వింటున్నాడు.

'మాలతి పెళ్లికి మీరూ రావాలి. మిస్టర్ మూర్తీ' అన్నాడు మధు - తీరుబడిగా సిగరెట్టు వెలిగించుకుంటూ.

'రాకపోతే ఊరుకు వెళ్లాలి' అని గోపాలరావు టీ త్రాగడం పూర్తిచేశాడు.

నా కదంతా ఆశ్చర్యంగా ఉంది. ఏమీ తోచక, 'ఎక్కడ?' అన్నాను.

'మా యింటి దగ్గిరే. ఇక్కడ ఎలాగూ వీల్లేదు. పెళ్ళికొడుకువారు వాళ్ళ ఊళ్లో చేయమంటారు. కాని మాలతికి కూడా అది ఇష్టం లేదు.' మాలతి తల దించుకుంది.

గోపాలరావు ఉత్సాహంతో 'ఎక్కడైనా సరే, భోగం మేళం ఉందా లేదా చెప్పుముందు' అన్నాడు.

'ఛీ. అటువంటివి పనికిరావు' అని తుది మాటగా అన్నాడు ఉమ. నాచ్ క్వశ్చన్ మీద గిరీశం పంతులుగారి ఉపన్యాసాలు జ్ఞాపకం వచ్చి, ఉమ కూడా ఒక సంస్కర్త అని నవ్వుకొన్నాను.

'మంత్రులనూ, నాయకులనూ పెళ్ళిళ్ళకు పిలవడం ఇప్పటి ఫేషన్ - అవునా, ఉమా?'

అందరమూ నవ్వాము.

'ముమ్మాటికీ'

మరింత గట్టిగా నవ్వాం.

మరికొంత సేపటిలో మధూ, ఉమా వెళ్లిపోయారు. మాలతి రిస్టువాచీ చూచుకొని, 'ఆరుంపావు. సినిమాకు వెళ్దామా? అంది. నేనుగోపీ వంకకు చూశాను. గోపాలరావు పని ఉన్న

వాడిలా తొందరగా లేచి, కిటికీలోంచి కేకేసాడు: 'వెంకన్నా... వెంకన్నా... అయిదు నిమిషాల్లో సినిమాకు బయలు దేరాలి. సిద్ధపడు' అని, 'మరి బయలుదేరు మాలతీ ఆట మొదలెడుతుంది.'

మాలతి దుస్తులు మార్చుకోడానికి వెళ్ళింది. గోపాలరావు తల దువ్వుతూ, కూనిరాగం తీస్తున్నాడు.

నేను పట్టలేక 'గోపీ' అన్నాను. నా స్వరం అతనికి వింతగా తోచి ఉంటుంది వెనుకకు నా వంక తిరిగాడు.

'గోపీ! వరుడెవరు? నువ్వేరా?'

'ఉమామహేశ్వరరావు బి. ఏ. షుగర్ ఫేక్టరీ యజమాని, పెట్టుబడిదారు' అని శాంతంగా ప్రతి అక్షరాన్నీ గంభీరంగా ఉచ్చరించాడు.

నాకు చెమటలు పోశాయి. నిజం అర్థం కాలేదు.

'...మరి... నీవు?'

'నాకేం?'

'...మాలతి ఒప్పుకొందా!'

గోపాలరావు ఆదరంతో నా వంకకు వచ్చాడు. 'మాలతి అతనిని ఎంత గాఢంగా ప్రేమిస్తుందో తెలుసా! తొలి రోజున చూసుకొన్నది మొదలు అహర్నిశలూ వాళ్ళ తలపులు మరొక దాని మీదకు పోలేదు-'ప్రేమ' తప్పితే వాళ్ళ ఆలోచనలూ, కోర్కెలూ, స్నేహమూ అన్నీ దానిమీదే పెరుగుతూ ఆధారపడ్డవి. నాకు మొదటిరోజే తెలుసు, వాళ్ళదారి ఈ ప్రాంతాలలోనిదే అని...'

'కాని త్రికరణశుద్ధిగా మాలతి నిన్ను ప్రేమిస్తుంది. నాకు తెలుసు. తెలుసు!'

'అవును. ఇప్పుడుకూడా ఎప్పుడూ నన్ను ప్రేమిస్తుంది...కాని మాలతి దృక్పథంలోనే గాఢమైన మార్పు వచ్చింది, నీవు గమనించి ఉంటావు...'

'నాకు తెలుసు కనుకనే అంటున్నాను. ఇంకా ఆరు మాసాలు నిండలేదు. ఆనాటి రాత్రి తన అన్నను ధిక్కరించి చెప్పింది: గోపి తన పంచప్రాణాలు...నీవు మొదట్లో త్రోసిపుచ్చినప్పుడు ఆత్మహత్య చేసుకుంటాననలేదూ? నీవు భయపడ్డావు, కొంపతీసి ఏంచేస్తుందోనని...'

'అవును మూర్తీ! నేనుమాత్రం ఏమన్నాను? అప్పుడే యౌవనం ఆమె ప్రతి నాడిలోనూ, ప్రతి రక్త బిందువులోనూ నూతనంగా ఆవేశించిన రోజులలో ఆమెకు ప్రపంచం తెలీదు. నీతో అప్పుడే చెప్పానుకూడా. ఆమె మాటలు నమ్మనక్కర్లేదని. సంస్కృతి, విజ్ఞానం అభివృద్ధి చెందకముందు, మానవజాతి శైశవంలో ఏం జరిగింది? ప్రతిశక్తినీ ఆరాధించారు. క్రొత్త కనుక అర్థంకాక కాని అవన్నీ నిజాలా? ఆరాధనలో ఎంత యథార్థం ఉంది? వీరి మౌఢ్యానికి నవ్వుతాం. మతాలు మాయలుకూడా...నీకు తెలీని శక్తులన్నీ దేవతలూ అమ్మవార్లేనా? నీకు అర్థం కానిదంతా పవిత్రమేనా! ... పసితనం నుండి యౌవనానికి పెరిగే దశ సాధారణమైంది కాదు. చిన్నతనపు అభిప్రాయాలు విచ్చి, రాలిపోయే దశ యౌవనం. అమాయక ఆనంద ప్రపంచం వదలి సంసారపు లోతులు తగిలే చోటికి; ఆకస్మాత్తుగా కొత్త జీవిత విధానంలోనికి - బ్రహ్మాండమైన మార్పు...అవును. యౌవన ప్రారంభం అంటే వ్యక్తిత్వంలో వెసూవియస్ పగిలి కొన్ని 'పాంపే'లు అదృశ్యమవటం, కొన్ని 'రోము'లు వెలయటం. మనం చిన్నప్పుడు ఆనందించే 'అందం' ఒకలాటిది. యౌవనంలో అందాన్ని అందంగా కేవలం ఆనందించలేం. - అనుభవానికి దొరికేవన్నీ నిజానికి అందంగా ఉంటాయి. దూరపు కొండలు నునుపుకదూ? శబ్దం, రుచి, స్పర్శ ప్రతి విషయంలోనూ మహత్తర విప్లవం కలుగుతుంది దానిని అర్థంచేసుకోలేం. అందుకే అప్పటిలో మోహం, కామం నగ్నంగా కనిపించవు. తాను చేసేదంతా మంచిదే. తాను అనుభవించేదంతా అందమైనదే. యౌవనం అది. 'అహంకారం పూర్తిగా కాదు. చాలభాగం అమాయకత్వం, అజ్ఞానం. మాలతి నన్ను ప్రేమించాననక నాతో వ్యభిచరిస్తానని ముఖ్యంగా యౌవన ప్రారంభదశలో ఒప్పుకొంటుందా?'

నేను మౌనముగ్ధుడనై వింటున్నాను.

'కామమనే ప్రకృతిశక్తి ప్రతి మానవుణ్ణీ ప్రోద్బలించి చేయించుకొనే సృష్టి కార్యం.

పువ్వులు చేస్తున్నదే. మనుషులు దాన్ని తెర వెనక దొంగపనిగా ఎందుకు చేయాలి? బహిరంగ సత్యానికి లేని పవిత్రత మంగళసూత్రంలో ఉందనటం శుద్ధ వంచన.'

గదిలో చప్పుడు వినిపిస్తోంది. మాలతి జోడు తొడుగుకొన్నదని, అంతరాయం రాకముందే ఆతనిని విడాలని, కుతూహలం ఎక్కువయింది. కాని పెదవి పెకల్చలేకపోయాను.

'మాలతి తన యౌవన మోహానికి ఏదో పవిత్రత ఆరోపించింది. తాను పరిపూర్ణంగా విశ్వసించింది కూడా, ఈ ఆరునెలల సహవాసం ఫలితాన, ఎట్టకేలకు నిజం ఆమెకు అవగాహన చేయగలిగానని అనుకొంటాను. తీరని కామాన్ని ప్రేమ అంటుంది.'

'అయితే ఉమామహేశ్వరాన్ని ప్రేమించిందన్నావు మరి?'

'అన్నాను. ఇంకా అంటాను. కాని మరొక దృష్టిలో... హేతువాదంలో నమ్మిక ఉన్న మాట నిజమే. మాలతి సంగతి. కాని అది నమ్మకం అని గుర్తించుకోవాలి. తనకు తెలీకనే ఇలాంటి లక్ష నమ్మకాలు-మూఢనమ్మకాలన్నా ఫరవాలేదు- మాలతిలో ఉన్నాయ్. ఒక్కమాటలో, ఆమె ధనిక వర్గపు మనిషి, మూర్తీ! ఆమెకు మార్చుకం పుకాదుల దగ్గర్నుంచి తప్పితే సాధ్యం కాదు. నాతో ఎన్నాళ్ళుండగలదు? పాపం, నేను చాలా ఆలోచించాను. చూచాను కదూ, ఎప్పుడూ పరీక్షలాటి జీవితం గడిపేది నాతో. నేను జీవితాన్ని విమర్శిస్తాను, ఆమె అనుభవిస్తుంది. మాలతి ఓర్పుకు నాకే ఆశ్చర్యం, ఎల్లా ఆట్లా మాసాల కాలం సహించగలిగిందోనని. సామాన్యులు గడపలేని ఒక క్షణాన్ని...'

మాలతి ఊడిపడింది. అకస్మాత్తుగా నా కామెలో ఏదో పెద్దమార్పు కనిపించింది. గాలి పూరించిన రబ్బరు బంతిలా యౌవనభారంతో అతి ఆకర్షణీయంగా విపరీత సౌందర్యవతిలా గోచరించింది.

'ఉండండి. టీ తీసుకుందాం' అని మాలతి అంటుండంగానే టీ వచ్చింది. నేను మౌనంగా ఆమె చేతినుండి కప్పు అందుకొన్నాను. గోపాలరావు విసుకుగా లాక్కున్నాడు.

'మూర్తి అలా ఉన్నాడేం!'

నవ్వుతూ గోపి అడిగాడు: 'ఎలా?'

'ఎలా! చావుదెబ్బలు తిని, మొహం వాచినట్టు-' మాలతి గట్టిగా నవ్వింది.

'నిజమే. ఈరోజు చావుదెబ్బలు తిన్నాను,' అని ఎర్రబారి గొణిగాను. నామాటలకు నేనే భయపడి, ఆమె మరొక మాట అనక మునుపే: 'సినిమా ఆరంభం ఇంకా అయిదు నిముషాల్లో. ఆలస్యం అవుతుంది' అని వేగిరించాను. మాలతి తొందరపడి, గోపాలరావు చేతిని యీడ్చుకుంటూ మెట్లు దిగింది. నేను బరువుగా అనుసరించాను.

'ఏడు గంటలకు నా మిత్రుడు వస్తాడు. క్షమించాలి, రాలేనందుకు' అని వాళ్ళు మోటారులో కూర్చోగానే బెక్కుతూ చెప్పాను.

మాలతి ఆశ్చర్యంతో: 'నిజంగా రావూ?'

గోపాలరావు వెంకన్నను హెచ్చరించాడు: 'పోనియ్!'

బర్రుబర్రుమని ఇంజను స్టార్టయి, నాలుగు కాళ్ళతో వారు వెళ్ళిపోయారు. నేను కొయ్యబారి నిలిచాను. నా మనసులో గింగురుపెట్టిన మాటలలో వాడిబల్లెం లాగున నన్ను కలత పెట్టినది 'విధిర్బలీయసి' అన్న భావం.

---

మానవుడి హేతువాదం గుర్రపుస్వారి చెయ్యడానికి ప్రయత్నించే త్రాగుబోతు వంటిది. కష్టపడి ఒకపక్క నిలబెడితే, రెండో పక్కకి ఒరిగిపోతుంది—లూథర్.

** ** ** **

జీవితంలో జరిగే మూడు ముఖ్యమైన సంఘటనలూ హేతువాదానికి అతీతమైనవే—జననం, వివాహం, మరణం—ఆస్టిన్.